క్లుప్తంగా

దసరాకు ప్రత్యేక బస్సులు


ఉపేందర్

సంగారెడ్డి టౌన్: దసరా పండగ సందర్భంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో ప్రయాణించే వారికి ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు సంగారెడ్డి ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ఉపేందర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 13 నుంచి 24వ తేదీల మధ్య సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. 21 నుంచి 23 వరకు, 28 నుంచి 31 తేదీల మధ్యలో ప్రయాణించినవారు టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాసి ఆయా బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయా లని సూచించారు. లక్కీ డ్రాలో మెదక్ రీజియన్ పరిధిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.9,900 విలువగల బహుమతులు అందజేస్తామన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం


మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని, కాంగ్రెస్‌తోనే ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల గ్రామంలో గురువారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆరు పథకాల గ్యారెంటీలు వివరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌తో సుస్థిర పాలన సాధ్యమన్నారు. అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి దేవిశరన్నవరాత్రులు

మహంకాళి దేవాలయ గౌరవ అధ్యక్షుడు సపాన్నదేవ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని శ్రీ మహంకాళి దేవస్థానంలో ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచ 23వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మహంకాళి దేవాలయ గౌరవ అధ్యక్షుడు సపాన్నదేవ్ తెలిపారు. శుక్రవారం దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనము, మండపారాధన, కలశ స్థాపన, కుంకుమార్చన, మహాహారతి, చండీహోమం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

దేవిశరన్నవరాత్రులకు ఏర్పాట్లు

జహీరాబాద్ టౌన్: దసరా పండగను ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. మండపాల్లో అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు పూజలు చేస్తారు. అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తుంది. మండపాల్లో ప్రతిష్ఠించేందుకు అమ్మవారి విగ్రహాలను వాహనాల్లో తరలిస్తున్నారు. పట్టణంలోని మాణిక్‌ప్రభు మందిరం వద్ద అమ్మవారిని విగ్రహాన్ని ఏటా ప్రతిష్ఠించి పూజలు చేశబూరు. అలాగే భవానీ మాత ఆలయంలో శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నారు.

కేతకిలో ఢిల్లీ వసంత్ పూజలు


పూజలు చేస్తున్న ఢిల్లీ వసంత్

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకి సంగమేశ్వర ఆలయంలో సామాజిక ఉద్యమకారుడు, బీజేపీ నేత ఢిల్లీ వసంత్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల పార్టీలో చేరిన అనంతరం మొదటిసారి ఆలయానికి వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు కుంకుమార్చన, అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జయప్రదం చేయండి

సంగారెడ్డి అర్బన్: అక్టోబర్ 15న హైదరాబాద్‌లో నిర్వహించే దళిత సమ్మిట్‌ను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు దత్తు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అవస్థలు

- నిర్వహణ సరిగాలేక ఆధార్ కేంద్రాల మూసివేత
- పట్టించుకోని అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రస్తుతం ఆధార్ ప్రతీ ఒక్కరికి అవసరంగా మారింది. అన్ని లావాదేవీలకు కేంద్ర ప్రభుత్వం ఆధార్‌ను అనుసంధానం చేసింది. ప్రభుత్వ పథకాలను నుంచి ఆస్తుల క్రయవిక్రయాల వరకు ఆధార్ తప్పనిసరిగా మారింది. అయితే కొన్ని సమస్యలతో కేంద్రాలను రద్దు చేశారు. ఫలితంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.


జిన్నారంలోని ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): జిల్లా వ్యాప్తంగా గతంలో 41 ఆధార్ కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం కొన్ని కారణాల వల్ల 18 కేంద్రాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో ఆధార్ కార్డు పొందాలనుకునే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొత్త ఆధార్ కార్డు పొందటం, అప్‌గ్రేడ్, ఫోన్ నంబర్ లింక్ చేయటం, పుట్టిన తేదీ, చిరునామా మార్పులు కేంద్రాల్లోనే చేయాలి. ఇవి అందుబాటులో లేకపోవటంతో పొరుగు జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. తమ పిల్లల ఆధార్‌ను అప్‌గ్రేడ్ చేయాలంటే తల్లిదండ్రులకు శిరోభారంగా మారింది. కేంద్రాల నిర్వహణ సరిగా లేకపోవటంతో వాటిని మూసివేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అయితే నూతన కేంద్రాలను ఏర్పాటు చేసే విషయంలో వారు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధికారుల చర్యలు నామమాత్రం

ఆధార్ కేంద్రాలు లేకపోవటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్న విషయం అధికారులకు తెలుసు. అయినా నూతన కేంద్రాలను ఏర్పాటు చేసే విషయంలో వారు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. మండల రెవెన్యూ అధికారులు మాత్రం ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తక్షణమే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోర్టు పరిధిలో ఉంది

కొన్ని సమస్యలతో ఆధార్ కేంద్రాలు రద్దయ్యాయి. ఆధార్ కేంద్రాల నిర్వహణకు సంబంధించి కోర్టు కేసు ఉంది. ఈ కేసు ఉండటం వల్ల కొత్త వాటిని ఏర్పాటు చేయలేక పోతున్నాం. ప్రస్తుతం బ్యాంకుల్లో ఆధార్ పనులు చేసుకోవచ్చు. ఆధార్ విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురావచ్చు.

– ప్రదీప్‌కుమార్, జిల్లా మేనేజర్

డిగ్రీ విద్యార్థుల మేరీ మిట్టి మేరా దేశ్ ర్యాలీ


జోగిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానికంగా సేకరించిన మట్టితో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వలంటీర్లతో పట్టణంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలని, దేశసేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు గోపాల్, అనసూర్య, శ్రీకాంత్, పండరి, అధ్యాపకులు డాక్టర్ అడవి రాజు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

కొండాపూర్(సంగారెడ్డి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా యోగా పోటీలకు మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన షణ్ముఖ ప్రియ, సుమతి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పండరీ నాయక్ శుక్రవారం తెలిపారు. వీరు ఈనెల 28, 29, 30 తేదీలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ కాంతయ్య, ఎస్ఎంసీ చైర్మన్ లలిత, ఉపాధ్యాయులు అభినందించారు.

'న్యాయం చేసేవారికే మా మద్దతు'

మున్నూరు కాపు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి


మాట్లాడుతున్న మున్నూరు కాపు నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దశాబ్దాలుగా మున్నూరు కాపులను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయని, తమకు న్యాయం చేసిన వారికి అండగా నిలుస్తామని మున్నూరు కాపు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాయికోటి యాదగిరి స్పష్టం చేశారు. శుక్రవారం రామచంద్రాపురం మున్నూరు కాపు కార్యాలయంలో కాపు సంఘం వ్యవస్థాపకులు తిక్కరెడ్డి, విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీలు అనేక హామీలు ఇచ్చి, ఎన్నికల తర్వాత ఆ హామీలను విస్మరిస్తున్నారని అన్నారు. మున్నూరు కాపులను రాజకీయంగా, సామాజికంగా ఎదగకుండా రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభాలో 25 శాతం ఉన్న తమకు అదే నిష్పత్తిలో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఏటా రూ.5 వేల కోట్లు కేటాయించాలని, ఈ అంశాలను పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పవన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన మద్యం స్వాధీనం

- రూ.4.43 లక్షల నగదు, వాహనం సీజ్
- 15 మందిపై కేసు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఎస్పీ శ్రీనివాస్



స్వాధీనం చేసుకున్న మద్యం, నగదుతో ఎక్సైజ్ అధికారులు

మునిపల్లి(అందోల్)/ సంగారెడ్డి: వాహనాల తనిఖీల్లో భాగంగా సుమారు రూ.లక్ష విలువైన మద్యం, రూ.4.43 లక్షల నగదు, ఒక వాహనాన్ని సీజ్ చేసి, 15 మందిపై కేసులు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలిపారు. ఎన్నికల్లో మద్యం రవాణాను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ మెదక్ డివిజన్, సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కంకోల్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా టెంపోలో మద్యం రవాణా చేస్తున్న హైదరాబాద్ గోషామహల్‌కు చెందిన 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 45.7 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కర్నాటక బస్సులో నగదును తీసుకెళ్తున్న మహిపాల్‌జైన్ నుంచి సుమారు రూ.4.43 లక్షలు సీజ్ చేశామని, అలాగే మరో వ్యక్తి రాజప్ప రవాణా చేస్తున్న కర్నాటక మద్యం ప్యాకెట్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో సీఐ హెచ్.మోహన్‌కుమార్, స్వాతి, ఎస్.రమేశ్‌రెడ్డి, జె.మధుబాబు, ఎస్ఐ అనిల్‌కుమార్, సీహెచ్.పృథ్వీరాజ్, విశ్వనాథ్, సిబ్బంది అలిమ్, సతీష్ మోహన్, అనిల్ కుమార్, శాంత, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

మాణిక్‌రావు విజయానికి కృషి చేయాలి

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రస్తుత ఎమ్మెల్యే మాణిక్‌రావు జహీరాబాద్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున ఆయన గెలుపునకు కలసికట్టుగా కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మామిడ్గి గ్రామ శివారులోగల ఎస్ఎస్‌వీలో శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. వచ్చే సోమవారం నుంచి ప్రారంభించే ఎన్నికల ప్రచార కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ముందుగా రేజింతల్ గ్రామ శివారులో వెలసిన శ్రీసిద్ధివినాయక ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం న్యామతాబాద్ గ్రామం నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తామన్నారు. న్యామతాబాద్‌తో పాటు హుస్సెన్‌నగర్, చీకుర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజన్‌వాడ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శని అమావాస్య పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ ఆవరణలోని శనీశ్వర ఆలయం, ఏడాకులపల్లి గ్రామంలోని శనిఘాట్ ఆలయ ఆవరణలో అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు బర్దిపూర్ ఆశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్యశిఖామణి అవధూత గిరి మహరాజ్, సప్తపురి శనిఘాట్ ఆలయ నిర్వాహకులు రఘునందన్ రెడ్డి, శారద భాస్కర్ రెడ్డి తెలిపారు. శని అమావాస్య పూజలు నిర్వహించేందుకు భక్తులు భారీగా తరలిరానున్నందున నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


బర్దిపూర్ గ్రామంలోని శనీశ్వర స్వామి

ప్రమాదకరంగా జాతీయ రహదారి


జాతీయ రహదారిపై ఇసుక మేట

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జాతీయ రహదారిపై పలుచోట్ల ఇసుక మేటతో ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము వాహనదారుల కళ్లలో పడుతుండటంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి పలువురు గాయపడ్డారు. అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ఇసుక లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


చండీయాగం చేస్తున్న చంద్రమౌళీశ్వర శర్మ, ధర్మకర్త కిషన్‌సింగ్ దంపతులు

చండీ యాగం

కల్హేర్(నారాయణఖేడ్): విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహామందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణ శాఖ అధికారి మూడ్ కిషన్ లలిత దంపతులు సప్తశతి నవ చండీయాగం చేపట్టారు. నిజాంపేట మండలంలోని బల్కం చెల్క తండా (భక్తిధాం తండా)లో శుక్రవారం టీవీ ఆర్టిస్టు, సిద్ధాంతి చంద్రమౌళీశ్వర శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ, కర్ణాటకకు చెందిన వేదపండితులు.. దేవత హోమాదులు, నవధాన్యాల పూజ, హోమం, హారతి, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. తండాలో భక్తిపారవశ్యం నెలకొంది.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం

మాజీ మంత్రి చంద్రశేఖర్


హరిచంద్‌నాయక్ తండా ప్రజలతో సమావేశమైన మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని మాజీ మంత్రి, నియోజకవర్గ పార్టీ చీఫ్ కో ఆర్డినేటర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్, జాంగార్‌బౌలితండా, హరిచంద్‌నాయక్ తండా, విఠునాయక్ తండాల్లో వస్తున్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. పదేళ్లుగా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేస్తామన్నారు. రాజకీయాలకతీతంగా అందరికీ ఇళ్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్. ఉజ్వల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మక్సూద్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సదాశివపేటలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ, హెచ్‌ఎం అరవిందశ్రీ


నారాయణఖేడ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

విద్యా సంస్థల్లో పూల పండగ

పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. పాఠశాలల ఆవరణలో బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. పండగల ప్రాముఖ్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం**


రాజుపాటిల్‌ను సన్మానిస్తున్న ఖేడ్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

నారాయణఖేడ్: నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేందర్ పటేల్ ఇటీవల డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందాడు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఖేడ్ డిప్యూటీ తహసీల్దార్ సందీప్, ఆర్ఐ శ్యాంరావు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఈశ్వర్, రామలక్ష్మి, అనిల్ రెడ్డి, రాజు, రమేశ్, రవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్‌లో చేరికలు**


పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని వావిలాల గ్రామ ఉపసర్పంచ్ నవనీత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామ పద్మశాలి సంఘం సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రజాపక్ష నాయకుడిని ఎన్నుకోవాలి**


కొడెకల్ బీఎస్పీ కమిటీతో ముప్పారం ప్రకాష్

వట్‌పల్లి(అందోల్): వచ్చే ఎన్నికల్లో ప్రజాపక్ష నాయకుడిని ఎన్నుకోవాలని బీఎస్పీ అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పారం ప్రకాష్ అన్నారు. అందోల్ మండలం కొడెకల్ గ్రామంలో శుక్రవారం బీఎస్పీ గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందోల్ నియోజకవర్గంలో బీఎస్పీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో అందోల్ అసెంబ్లీ అధ్యక్షుడు పల్లె కుమార్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

◆ **మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన రెడ్డి సంఘం**


సమావేశమైన రెడ్డి సంఘం నాయకులు

జహీరాబాద్: పట్టణంలో రెడ్డి సంఘం భవనం కోసం స్థలం కేటాయించినందుకు ఆ సంఘం నాయకులు మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పీవీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెడ్డి సంఘ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతో పాటు రూ.80 లక్షలు మంజూరు చేశారన్నారు. స్థలం మంజూరుకు సహకరించిన ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావుకూ వారు కృతజ్ఞతలు తెలిపారు.